క్లుప్తంగా

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డీపీటీఓ సీహెచ్ అప్పలనారాయణ

విజయనగరం టౌన్: ఏపీఎస్ ఆర్టీసీలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను డ్రైవర్లు సద్వినియోగం చేసుకోవాలని ప్రజా రవాణాధికారి సీహెచ్ అప్పలనారాయణ సూచించారు. డిపో గ్యారెజ్‌లో నిర్వహించిన శిక్షణను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, డ్రైవింగ్‌లో మెలకువలు తెలుసుకుని శిక్షణను సమర్థవంతంగా పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిపో ఎస్‌డీఐలు సీహెచ్ వేణు, బీవీఆర్ఎం రాజు, డీఎస్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

విరాళం

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి నిత్యాన్నదానానికి విశాఖపట్నం సీతమ్మధార టీపీటీ కాలనీకి చెందిన దాట్ల జయశంకర్ ప్రసాద్ రాజు లక్ష రూపాయల విరాళాన్ని శుక్రవారం ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ కేఎల్.సుధారాణి మాట్లాడుతూ, అమ్మవారి ఆలయ అభివృద్ధికి దాతల సహకారం ఎనలేనిదన్నారు. ఆలయ విస్తరణ, అభివృద్ధికి దాతలు మరింత ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

విజయనగరం ఫూల్‌బాగ్: పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ ఈనెల 30న జిల్లా వ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి టి. సూర్యనారాయణ, సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు బి. శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో రేషన్ సరుకులు పంపిణీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ బంగార్రాజు

భోగాపురం: మండలంలో ఉన్న లబ్ధిదారులకు రేషన్ సరుకులను పూర్తి స్థాయిలో పంపిణీ చేయాలని తహసీల్దార్ బంగార్రాజు చౌకధరల దుకాణ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లకు సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి నెలా 15వ తేదీలోపు లబ్ధిదారులకు రేషన్ సరుకులు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ మురళీ, రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణంపై ఫిర్యాదు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో కొంతలవాని చెరువు గర్భంలో జరుగుతున్న ఆలయ నిర్మాణంపై సీపీఎం నాయకుడు కె. రామారావు తహసీల్దార్ రమణరాజుకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. సర్వే 100లోని కొంతలవాని చెరువు గర్భం ఇప్పటికే చాలావరకు ఆక్రమణకు గురైందని.. తాజాగా అయ్యప్ప గుడి నిర్మాణం చేపడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో దిగువనున్న ఆయకట్టుకు సాగునీరందని పరిస్థితి తలెత్తుతోందన్నారు. వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

జరజాపుపేటలో ఉచిత నేత్ర వైద్యశిబిరం రేపు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో ఈ నెల 25న ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు స్థానిక సాధనా యువజన సంఘ అధ్యక్షుడు పోలుబోతు దుర్గాప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అంధత్వ నివారణా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మురళీకృష్ణ ఫంక్షన్ హాల్‌లో శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో రోగులకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తారన్నారు.

జిల్లా పశుగణాభివృద్ధి సంఘం డైరెక్టర్‌గా లక్ష్మణ్



ఉత్తర్వులు అందుకుంటున్న లక్ష్మణ్

చీపురుపల్లిరూరల్(గరివిడి): జిల్లా పశుగణాభివృద్ధి సంఘం డైరెక్టర్‌గా గరివిడి మండలం వి.పి.రేగ గ్రామానికి చెందిన గుంటుబారిక లక్ష్మణ్‌ను నియమిస్తూ జిల్లా పశుగణాభివృద్ధి సంఘం కార్యనిర్వహణ అధికారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గరివిడి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ కొణిశ కృష్ణంనాయుడు ఆయనకు ఉత్తర్వులను అందజేశారు. యడ్ల అప్పారావు,పొన్నాడ కుమార్, గేదెల ఆదినారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలు సులభతరం..

- జగనన్న సురక్ష కార్యక్రమ నిర్వహణకు కార్యాచరణ సిద్ధం
- కార్పొరేషన్ పరిధిలో రెండు ప్రత్యేక బృందాలు

ఏయే డివిజన్‌లలో ఎప్పుడు..

తేదీ	డివిజన్‌లు
వచ్చే నెల 1	1,2,3,4
4	5,6, 7,8,9
7	10,11,12,13,14,15
11	16,17,18,60, 19, 20,22,23
13	21,24,25,26, 27,28,29
15	30,31,61, 32,33
18	34,35,36,37,38
20	39,40,41,42,43
22	44,45,46,47,48,49
25	50, 52,51,53
27	54, 55, 56, 57,58,59



జగనన్న సురక్షా కార్యక్రమం కరపత్రం

విజయనగరం: ప్రజలందరికీ ప్రభుత్వ సేవలు మరింత సులభతరంగా అందించాలనే ప్రధాన లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమ నిర్వహణకు విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు 11 రకాల సేవలను తక్షణమే అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించగా... ఆ మేరకు అవసరమైన అర్హుల జాబితాను సిద్ధం చే సేందుకు కార్యాచరణ రూపొందించారు. నగరంలోని 50 డివిజన్‌లు ఉండగా.. వాటి పరిధిలో జనాభా ప్రతిపాదికన 61 సచివాలయాలు ఉన్నాయి. వాటన్నింటి పరిధిలో వచ్చే నెల 1 నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించనుండగా.... ఆయా సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించేందుకు వారం రోజుల ముందు వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఆయా సచివాలయాల పరిధిలో ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించనున్నారు. ఇలా సేకరించిన వివరాల ఆధారంగా నిర్దేశించిన తేదీల్లో ఆ సచివాలయం పరిధిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ప్రత్యేక శిబిరం నిర్వహించి వారికి అవసరమైన ధ్రువపత్రాలు అందజేయనున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కార్పొరేషన్ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ నేతృత్వంలో 8 మందితో కూడిన ప్రత్యేక బృందాలను నియమించారు. ఒక్కో బృందంలో నలుగురు సభ్యులు ఆయా తేదీల్లో నిర్వహించే కార్యక్రమాలను దగ్గరుండి పర్యవేక్షించనున్నారు.

ప్రతి కుటుంబాన్ని కలిసి... అవసరాలు తెలుసుకుని...

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వచ్చే నెల 1 నుంచి ప్రారంభించనుండగా... కార్యక్రమం నిర్వహించే సచివాలయం పరిధిలోని ప్రతి కుటుంబాన్నీ వారం రోజుల ముందుగా సంబంధిత వలంటీర్, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు కలవనున్నారు. వారికి అవసరమైన ధ్రువపత్రాల కోసం వివరాలను సేకరించనున్నారు. అంతేకాకుండా ప్రభుత్వపరంగా అమలవుతున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందకపోతే అందుకు గల కారణాలను నమోదు చేసుకోనున్నారు. ఇలా జిల్లాలోని ప్రతి కుటుంబాన్నీ కలిసి జగనన్న సురక్ష కార్యక్రమంలో వారికి అవసరమైన ధ్రువపత్రాలు అందజేయనున్నారు. రాష్ట్ర స్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలను, జిల్లా స్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కారం చూపనున్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి



నెల్లిమర్ల: విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ విజయ్‌నాథ్



విజయనగరం క్రైమ్: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్

విజయనగరం క్రైమ్: మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టి సారించాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ బి.మధుకుమార్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలో అయ్యన్నపేటలో ఉన్న ఎస్‌కే డిగ్రీ కళాశాల ఆవరణలో మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు రవాణా చేసినా, వినియోగించినా జీవితాలు చిన్నాభిన్నం అవుతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, యాజమాన్యం, ఎస్ఈబీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

నెల్లిమర్ల: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని భోగాపురం సీఐ కేవీ విజయ్‌నాథ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని చక్ర జూనియర్ కళాశాలలో పోలీసుల ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, మద్యం తాగడం, గంజాయి కాల్చడం, హెరాయిన్ వంటి డ్రగ్స్ తీసుకోవడం, తదితర వ్యసనాలకు యువత దూరంగా ఉండాలన్నారు. మత్తుకు బానిసలైతే అనారోగ్యం బారిన పడతారన్నారు. విద్యాలయాల్లో ఎక్కడైనా మత్తు పదార్థాలు విక్రయించినా, వినియోగించినా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై పి. నారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

28న సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో సంతోషిమాత అమ్మవారు



కుంకుమార్చనలు చేస్తున్న మహిళలు

విజయనగరం టౌన్: పట్టణంలోని మయూరి కూడలిలో కొలువైన సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం ఈ నెల 28న ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకుడు రమేష్ తివారీ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, ఆ రోజు ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, 6 నుంచి 8 గంటల వరకు గణపతి పూజ, పుణ్యాహవచనం, 8.45 గంటలకు గోమాత విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఉంటుందన్నారు. అనంతరం సర్వతోభద్ర మండలం ఆవాహనం, సహస్ర కుంకుమార్చన.. మధ్యాహ్నం హోమం.. సాయంత్రం పూర్ణాహుతి.. రాత్రి 7 గంటలకు మంగళహారతి ఉంటాయన్నారు. భక్తులందరూ అమ్మవారిని దర్శించి తరించాలని కోరారు.

సంతోషిమాతకు విశేష పూజలు

సంతోషిమాత అమ్మవారికి అర్చకుడు రమేష్ తివారీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. ఆలయ ఆవరణలో మహిళలతో సహస్ర కుంకుమార్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

డివిజన్ల అభివృద్ధే లక్ష్యం

- ఏ డివిజన్‌పైనా చిన్న చూపు లేదు
- అర్హత ఉండి పథకాలు అందకుంటే జగనన్న సురక్ష కార్యక్రమంలో చెప్పండి
- నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న కోలగట్ల శ్రావణి, తదితరులు

విజయనగరం: నగరంలోని అన్ని డివిజన్‌లనూ సమపాళ్లలో అభివృద్ధి చేస్తున్నామని, ఏ డివిజన్ పైనా చిన్నచూపు లేదని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. నగర అభివృద్ధికి ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి కృషి చేస్తున్నారని చెప్పారు. నగరంలోని 14వ డివిజన్ కొత్తపేట పరిసర ప్రాంతాల్లో శుక్రవారం కొనసాగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలనపై ఆరా తీస్తూ, సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని చోట్ల కాలువలు, వీధి దీపాల సమస్యను స్థానికులు తెలియజేయగా.. సమస్యలు వెంటనే పరిష్కరించాలని అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట్ల పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అర్హతలుండి సంక్షేమ పథకాలు మంజూరు కాకపోతే త్వరలో ప్రారంభంకానున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో తెలియజేయాలన్నారు. అనంతరం 14వ డివిజన్ అధ్యక్షుడు ఇసరపు శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రజారంజక పాలన సాగుతోందన్నారు. దేశంలోనే తొలిసారిగా ప్రజల చెంతకు పాలన తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందని చెప్పారు. నగర అభివృద్ధికి ఎమ్మెల్యే కోలగట్ల ఎంతగానో కృషి చేస్తున్నారని, ఇందులో భాగంగానే ప్రధాన జంక్షన్ల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, ఫుడ్‌బ్యాంక్‌ల ఏర్పాటు వంటి అనేక ప్రజాహిత కార్యక్రమాలు సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ నడిపేన శశిభార్గవి, ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్, ప్రభుత్వ సిబ్బంది, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో మరిన్ని సేవలు

- ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు



పూసపాటిరేగ: మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న సురక్ష వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



డెంకాడ: మోపాడలో జగనన్న సురక్ష పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

డెంకాడ: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు మరిన్ని సేవలు ఇంటివద్దనే అందిస్తారని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం మండలంలోని మోపాడ సచివాలయంలో శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్యక్రమంలో భాగంగా అధికారులు గ్రామాల్లో సభలు నిర్వహించి, 11 రకాల సేవలు ప్రజలకు అందిస్తారని చెప్పారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, ఎంపీడీఓ స్వరూపారాణి, డీటీ సూర్యకాంతం, మాజీ సర్పంచ్ బడ్డుకొండ రమేష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతం చేయండి..

నెల్లిమర్ల రూరల్: మండలంలో వచ్చే నెల 1 నుంచి 28 వరకు జరగనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జేసీఎస్ మండల కన్వీనర్, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, అర్హులందరికీ ప్రభుత్వ సేవలు నిష్పక్షపాతంగా అందాలనే మంచి లక్ష్యంతో సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు బాధ్యతగా వ్యవహరించి, కార్యక్రమం విజయవంతానికి కృషి చేయాలని కోరారు.

సద్వినియోగం చేసుకోవాలి..

పూసపాటిరేగ: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జి. రామారావు అన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తిలకించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, ఏ కారణం వల్లైనా అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే ఈ కార్యక్రమంలో తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇ.భాస్కరరావు, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు మహంతి జనార్దనరావు, తదితరులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల: వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న చైర్‌పర్సన్ బంగారు సరోజిని, తదితరులు

కార్యక్రమ ప్రారంభోత్సవాన్ని తిలకించిన ప్రజాప్రతినిధులు

నెల్లిమర్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నెల్లిమర్ల నగర పంచాయతీకి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు స్థానిక నగర పంచాయతీ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తిలకించారు. చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్‌చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు, మేనేజర్ విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

విత్తన మొలకశాతం పరీక్షించుకోండి



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

గజపతినగరం రూరల్: ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న విత్తనాల మొలకశాతాన్ని పరీక్షించుకోవాలని, 80 కంటే తక్కువ శాతం మొలక ఉంటే తక్షణమే విత్తనా ల బ్యాగులను మార్చుకోవాలని రైతులకు గజపతినగరం ఏడీఏ మహారాజన్ సూచించారు. మండలంలోని కొత్తబగ్గాం రైతు భరోసా కేంద్రంలో రైతులకు రాయితీపై వరి విత్తనాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులు తమ పరిధిలోని వీఆర్‌ఓల ద్వారా కౌలు గుర్తింపు కార్డులు పొందాలని సూచించారు. నాయకులు పల్లి సంజీవరావు, ఏఓ ధనలక్ష్మి, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాల సందడి..

- 24వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు అవకాశం



విజయనగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణం



టాపర్‌గా నిలిచిన సౌమ్యకు అభినందిస్తున్న అధ్యాపకులు

విజయనగరం అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాల సందడి మొదలైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక మూడేళ్ల కిందట ఏర్పాటు చేసిన డిగ్రీ కళాశాలకు విద్యార్థుల ప్రవేశాల తాకిడి పెరిగింది. జిల్లా కేంద్రం, పరిసర మండలాలకు చెందిన పేద, బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు డిగ్రీ కోర్సులు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం పట్టణంలోని మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాల ఆవరణలో తాత్కాలికంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసింది. శాశ్వత భవనాల నిర్మాణం కోసం ప్రభుత్వం స్థల సేకరణ చేపడుతోంది. పీహెచ్‌డీ, నెట్, ఏపీ స్లెట్ విద్యార్హత గల బోధనా సిబ్బందితో నాణ్యమైన బోధన అందిస్తూ అనతికాలంలోనే గుర్తింపు తెచ్చుకుంది. డాక్టర్ పి.అనిల్‌కుమార్ స్పెషల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్న ఈ కళాశాలకు ప్రస్తుతం ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ బి.శుభ ఉన్నారు. కళాశాలలో ప్రస్తుతం బీఏ, బీకాం, బీఎస్సీ (ఎంపీసీ), బీఎస్సీ (బైపీసీ) కోర్సులు అందిస్తున్నారు.

కళాశాల ప్రత్యేకతలు

- అతి తక్కువ ఫీజులతో ఉత్తమ విద్యాబోధన
- ఆధునిక పరికరాలతో కూడిన సైన్స్ ప్రయోగశాల
- రిఫెరెన్స్ పుస్తకాలు కలిగిన లైబ్రరీ
- బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం
- విద్యార్థినీ, విద్యార్థులకు వేర్వేరుగా హాస్టల్ సదుపాయం
- బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు
- అర్హత గలిగిన ఈబీసీ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ మంజూరు
- విద్యార్థుల నైపుణ్యాలను వెలికి తీసే ఫీల్డ్ ట్రిప్స్, స్టూడెంట్స్ సెమినార్స్
- విద్యార్థినుల సర్వతో ముఖాభివృద్ధికి ఉమన్ ఎంపవర్‌మెంట్ సెల్

24వ తేదీ వరకు అవకాశం..

డిగ్రీలో ప్రవేశాలకు ఈ నెల 24వ తేదీలోగా ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవచ్చు. కళాశాలలు, కోర్సులను ఎంచుకోవడానికి 26 నుంచి 30 వరకు వెబ్ ఆప్షన్‌కి అవకాశం ఇస్తారు. వచ్చే నెల 7వ తేదీన సీట్ల అలాట్మెంట్‌ను ఆన్‌లైన్‌లో ప్రకటిస్తారు. అలాట్ అయిన అభ్యర్థులకు ఎంపికైన కళాశాలల్లో 4వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

3వ సెమిస్టర్ ఫలితాల్లో కళాశాల విద్యార్థిని టాప్

ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలోని 3వ సెమిస్టర్ ఫలితాల్లో పట్టణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఎస్సీ ఎంపీసీ విద్యార్థిని ఎం.సౌమ్య 9.52/10 జీపీఏతో ప్రతిభ కనబరిచింది. ఈ ఫలితాల్లో కె.సునీత 9.04, కె.చంద్రిక 8.74, కె.ప్రవల్లిక 8.56, కె.లహరి 8.33 జీపీఏ సాధించారు. వీరిని కళాశాల ప్రత్యేక అధికారి డాక్టర్ పి.అనిల్‌కుమార్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బలగ శుభ, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

పేద విద్యార్థులకు వరం

జిల్లా కేంద్రంలో ప్రైవేట్ డిగ్రీ కళాశాలలే ఉన్నాయి. ఫీజుల భారంతో డిగ్రీ కోర్సులు చదవలేని పరిస్థితిలో పేద, బడుగు, బలహీన వర్గాల కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడం అభినందనీయం. తక్కువ ఫీజుతో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నత విద్య అందిస్తున్నారు. మా లాంటి పేద విద్యార్థులకు ఈ కళాశాల వరం.

-కె. పవన్‌కుమార్, బీఎస్సీ (ఎంపీసీ) విద్యార్థి

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

చీపురుపల్లి: రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని రాజాం వ్యవసాయశాఖ ఏడీ కె.చంద్రరావు హెచ్చరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు చీపురుపల్లి ఎస్ఐ ఏ.సన్యాసినాయుడు, ఏఓ సీహెచ్.రఘునాథ్‌లతో కలిసి పట్టణంలోని విత్తన దుకాణాల్లో శుక్రవారం తనిఖీలు చేశారు. స్టాకు, రికార్డుల్లో పొందుపరిచిన వివరాలను పరిశీలించారు. విత్తనాల కృత్రిమ కొరత సృష్టించరాదని దుకాణాల యజమానులకు తెలిపారు.